## క్లుప్తంగా

### మహిళలకు చీరల పంపిణీ



అంబర్‌పేట: శ్రీ స్వామియే శరణమయ్యప్ప మాస పత్రికను ఎడిటర్ ఈశ్వర్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో కోలాటం మహిళా బృందానికి ఆదివారం చీరలను అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మతో కలిసి మహిళా బృందం 42 మందికి ఈ చీరలను బాగ్ అంబర్‌పేట అయ్యప్ప టెంపుల్ వద్ద పంపిణీ చేశారు. శబరి క్షేత్ర దర్శనం కార్యక్రమంలో ఈ బృందం విశేష సేవలు అందించినందుకు గుర్తుగా ఈ చీరెలను అందజేసినట్లు గురుస్వామి ఈశ్వర్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఎస్.రమేష్, జిల్లా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### 12న భరత నాట్యప్రదర్శన

చిక్కడపల్లి: వంశీ ఆర్ట్ థియేటర్స్ శుభోదయం గ్రూప్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వంశీ స్వర్ణోత్సవాల సందర్భంగా సుజాతా శ్రీనివాసన్ (అమెరికా) శిష్యులు సీతావక్కలంక (అమెరికా), నిత్యకాశీభట్ల (అమెరికా) 2023 జనవరి 12వ తేదీ సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలో భరతనాట్యం ప్రదర్శించనున్నట్లు వంశీ సంస్థ వ్యవస్థాపకులు వంశీ రామరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరుగురు నాట్యగురువులకు వంశీ, శుభోదయం గ్లోబల్ అవార్డ్స్ బహూకరిస్తారని అన్నారు.

### కేలండర్ ఆవిష్కరణ



కేలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం అధ్యక్షుడు మల్లేష్ తదితరులు

నల్లకుంట: పోత్గల్ గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్ ఆవిష్కరణ సభ ఆదివారం నల్లకుంటలోని గంగ పుత్ర సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పోత్గల్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పెంటం మల్లేష్, కోశాధికారి పాకరాజు, కోశాధికారి బిజీ శ్రీనుతో కలిసి కేలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పోత్గల్ గంగ పుత్ర సంఘం ప్రతినిధి పాక సాంబయ్య, పారుపల్లి రాజు, నర్సింహ, సంతోష్, నర్సింగ్, ధర్మేందర్, సతీష్, పరశురామ్ పాల్గొన్నారు.

### మైమరిపించిన నృత్యోత్సవ్



చిక్కడపల్లి: త్యాగరాయగానసభలో ఆదివారం నిర్వహించిన జాతీయ నృత్యోత్సవ్ మైమరిపించింది. ప్రముఖ నాట్యగురువు జ్యోతి కులకర్ణి నేతృత్వంలో ఆమె శిష్యులు ఆరు బృందాలుగా పలు నాట్యాంశాలు నర్తించారు. విశ్రాంత న్యాయమూర్తి మదుసూదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని నర్తకులను సత్కరించారు. నిర్వాహకులు విక్కీ మాస్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### గంగపుత్రులు రాజకీయంగా ఎదగాలి



కేలెండర్‌ను ఆవిష్కర్తిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, నాగుల ప్రకాష్ తదితరులు

చిక్కడపల్లి: గంగపుత్రులు రాజకీయంగా ఎదగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలెండర్‌ను క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భారతి, లలిత, నాగుల ప్రకాశ్, పూసరాజు, గాండ్ల దేవయ్య పాల్గొన్నారు.

### యువకుడితో లాడ్జికి మైనర్

● నిర్వాహకులపై కార్పొరేటర్ ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: మైనర్ బాలిక ఓ యువకుడితో కలిసి లాడ్జీకి రాగా గమనించిన బీజేపీ నాయకులు లాడ్జీ నిర్వాహకులపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ వెనుక వైపున ఉన్న ఓ లాడ్జీకి శనివారం మధ్యాహ్నం 21 ఏళ్ల యువకుడు, 16 ఏళ్ల బాలిక వచ్చారు. నిర్వాహకులు వారి ఐడీ ప్రూఫ్‌లు చూడకుండా రూ.800 తీసుకుని గదిని అద్దెకిచ్చారు. ఈ విషయమై బీజేపీ నాయకులు కార్పొరేటర్ కొంతం దీపిక దృష్టికి తీసుకెళ్లగా ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చి లాడ్జీ నిర్వాహకులను నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బస్సు మళ్లీ నడపాలి

40నెంబర్‌బస్సు కోసం ప్రయాణికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న వినయ్‌కుమార్, బస్సు ప్రయాణికులు

చిక్కడపల్లి: 40 నంబర్ ఆర్టీసీబస్సును తిరిగి అశోక్‌నగర్ మీదుగా నడపాలని డిమాండ్ చేస్తూ అశోక్‌నగర్, గాంధీనగర్ వాసులు ఆదివారం అశోక్‌నగర్ చౌరస్తా వద్ద ధర్నాకు దిగారు. అశోక్‌నగర్ నుంచి హిమాయత్‌నగర్‌వైపు వెళ్ళే బస్సు రూట్‌ను మార్చటం వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్, నారాయణగూడ మీదుగా దారి మళ్లించడం వల్ల అశోక్‌నగర్ ప్రాంత వాసుల ఆర్టీసీ బస్సుకోసం నానా తంటాలు పడాల్సి వస్తోందని మండిపడ్డారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ మాట్లాడుతూ అశోక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో తరచూ బస్సు ప్రయాణం చేసే స్థానికులతో పాటు సీనియర్ సిటిజన్‌లు బస్సు రాకపోవడంతో హిమాయత్‌నగర్ వరకు నడిచి వెళ్ళాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా తిరిగి 40 నంబర్ బస్ రూట్‌ను అశోక్‌నగర్‌మీదుగా మార్చాలని కోరారు. ధర్నాలో బీజేపీ నాయకులు ప్రఫుల్‌రామిరెడ్డి, స్థానికులు రవీందర్‌రెడ్డి, గిరి, అశోక్‌నగర్ ప్రాంత సీనియర్ సిటిజన్స్ విద్యార్థులు మున్సిపల్ స్వీపర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం కూడా సమర్పించినట్లు వినయ్ వివరించారు.

## ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



గంగిరెద్దు విన్యాసాలు

కవాడిగూడ: ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఏవీ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నాయకత్వ లక్షణాలు పోరాట పటిమ అనే అంశంపై ముఖ్యఅతిథిగా శ్రీ ఎన్వీఎస్ రెడ్డి ప్రసంగించారు. సమస్యలు వచ్చినప్పుడు బెదిరిపోవద్దు, ఎవరు ఎలా ఆక్షేపించినా, మొక్కవోని దీక్షతో విజయపథంవైపు ముందుకు సాగాలని అన్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల విన్యాసాలు హరిదాసుల సంకీర్తనలు పల్లెపాటలు వంటి పలు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. రంగోళిలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ తెలుగు పండితులు శ్రీ అద్దంకి శ్రీనివాస్ తెలుగు మాటలలో తెలివి మూటలు అనే అంశంపై చమత్కారంగా ప్రసంగించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు ఎల్ ఇందిరా దత్తు, శ్రీమతి, ఎస్‌విజయలక్ష్మి, తెలుగు సమాఖ్య ఆశయాలు, సంక్రాంతి తెలుగు పండుగ గొప్పదనంపై ప్రసంగించారు.

### అన్నిదానాలకన్నా అన్నదానం మిన్న



నారాయణ సేవ(అన్నదానం) నిర్వహిస్తున్న దృశ్యం

నల్లకుంట: అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ చైర్మన్ రాజు అన్నారు. అన్నదానాన్ని ఒక మహాయజ్ఞంగా భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఆదివారం బాబా మందిరంలో మధ్యాహ్న హారతి అనంతరం నారాయణ సేవ(అన్నదానం) కార్యక్రమాన్ని సంస్థాన్ అధ్యక్షుడు పి.కృష్ణ ఇతర సభ్యులతో కలిసి చైర్మన్ రాజు పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థాన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కోవిడ్ కారణంగా గత రెండేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని నిలిపివేశామని చెప్పారు. పరిస్థితులు మెరుగుపడడంతో పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాన్ని పునః ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంస్థాన్ కమిటీ సభ్యులందరినీ శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

## సిరి సంపదలు వదలి.. సాధువులుగా మారి!

ఘనంగా జైన కుటుంబం దీక్షా మహోత్సవ శోభాయాత్ర



రథయాత్రలో ప్రితేష్ సంఘ్వీ, తత్వ సంఘ్వీ



వీడ్కోలు పలుకుతున్న జైనులు

రాంగోపాల్‌పేట్: తరతరాలుగా కూర్చుని తిన్నా తరగని ఆస్తి.. భార్యా ఇద్దరు పిల్లలతో పచ్చని సంసారం. కానీ సంసార జీవితం, భౌతికమైన బంధాలు, అనుబంధాలు, కోరికలు అన్నీ వృథా అని భావించి ఓ జైన కుటుంబంలోని నలుగురు సాధువులుగా మారి సన్యాసత్వం తీసుకోబోతున్నారు. దీక్షా మహోత్సవం తీసుకోబోతున్న సందర్భంగా ఆదివారం ఆ కుటుంబ సభ్యులకు బంధువులు, స్నేహితులు, జైనులు కలిసి వీడ్కోలు సభను నిర్వహించారు. రాణిగంజ్‌లో హార్డ్‌వేర్ వ్యాపారం నిర్వహించే డీవీకాలనీకి చెందిన ప్రితేష్ సంఘ్వీ (45), భార్య రిపాల్ సంఘ్వీ (42), కుమారుడు తత్వ సంఘ్వీ(18), కుమార్తె హిర్వి సంఘ్వీ (10) మార్చి 9వ తేదీన అహ్మదాబాద్‌లో సన్యాసం స్వీకరించబోతున్నారు. ఆ కుటుంబం సన్యాసం స్వీకరించబోతున్న సందర్భంగా ఆయన సన్నిహితులు, కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఆదివారం జనరల్‌బజార్‌లోని జైన మందిర్ నుంచి రాణిగంజ్, మినిస్టర్‌రోడ్, డీవీకాలనీ, పీజీరోడ్ మీదుగా హర్యానా భవన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. గుర్రపు బగ్గీలు, ఒంటెలు, రథాలపై చిన్నారులు కూర్చుని బ్యాండు మేళాలతో సందడిగా ఊరేగింపు కొనసాగించారు. సంఘ్వీ కుటుంబ సభ్యులు రథాలపై కూర్చుని తమ బట్టలు, డబ్బు కొన్ని వస్తువులు దారి వెంట చల్లుతూ సాగారు. అనంతరం హర్యానా భవన్‌లో వారికి వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జైనులు కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ తదితరులు ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు.

### అలరించిన బాలీవుడ్ చిత్ర గీతాలు



చిక్కడపల్లి: నిరంతరం తెలుగు పాటలతో సందడి సందడిగా కనిపించే శ్రీ త్యాగరాయగానసభ అవసర్ ఎంటర్ ట్రైన్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బాలీవుడ్ సినీగీత విభావరి సభికులను ఆదివారం అలరించింది. కళాదీక్షుతులు కళావేదికపై పలువురు హిందీ పాటలను పాడి తమ ప్రతిభను ప్రదర్శించారు. అ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బి.సునీల్‌కుమార్ సారథ్యంలో అన్నపూర్ణ భాస్కర్, తరుణ్ మేహాత, సునీల్ ఠాకూర్, రాజేంద్ర, శశికాంత్ పాల్గొన్నారు.

## మురుగు సమస్యను పరిష్కరించండి



పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లో వేధిస్తున్న మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక జలమండలి అధికారులకు సూచించారు. ఆదివారం ఆమె రెజిమెంటల్‌బజార్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించగా స్థానిక మహిళలు మురుగు నీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్‌లో ఈ పాటికే కొన్ని చోట్ల మురుగు నీటి, మంచి నీటి సమస్యల పరిష్కారానికి కొత్త పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టామని దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న టాయిలెట్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

### గొప్ప స్వరకర్త మధుస్రవంతి



చిక్కడపల్లి: ప్రతిభ ఉంటే సరిపోదని సినీరంగంలో నిలదొక్కుకోవాలంటే తపన, సహనం ఉండాలని ప్రముఖ సినీ దర్శకులు వీఎస్ ఆదిత్య అన్నారు. చిక్కడపల్లిలో త్యాగరాయగానసభ కళాదీక్షితులు కళావేదికలో ఎస్ఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో విడుదల కానున్న వాళ్ళిద్దరి మధ్య సినిమాకు తొలిసారిగా సంగీత దర్శకత్వం వహించిన మధుస్రవంతి స్వరరచన చేసిన పాటల ప్రదర్శన అభినందన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదిత్య మాట్లాడుతూ ఈ లక్షణాలు అన్నీ పుణికిపుచ్చుకున్న స్వరకర్త, గాయని మధుస్రవంతి అని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాపోషకులు, ఇట్క్లా, పాస్ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## కేలండర్ల ఆవిష్కరణ

బౌద్ధనగర్: డివిజన్‌కు చెందిన టీఎంఎంఎస్ నాయకుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆదివారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, హరి, బల్లు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట డివిజన్‌లో..**

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్ ముదిరాజ్ మహాసభ నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం సంఘం సభ్యులు నరేష్, సురేష్, గణేష్, శేఖర్, ఉదయ్ కాంత్ ఆవిష్కరించారు.

**రసూల్‌పురాలో..**

రసూల్‌పురా: రసూల్‌పురా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను ఆదివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంగారెడ్డి ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, సెక్రటరీ వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరి నర్సింహ రెడ్డి, కోశాధికారి విష్ణురెడ్డి పాల్గొన్నారు.

## ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం




అవార్డులను ప్రదానం చేస్తున్న హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతిభగల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయం అని హైదరాబాద్‌జిల్లా అడిషనల్ కలెక్టర్ మునిని వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభగల విద్యార్థులకు, వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు ఐక్యంగా వారి సామాజిక వర్గాల అభివృద్ధికోసం కృషిచేయడం ఆదర్శనీయం అన్నారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహ అధ్యక్షులు ఎనగండ్ల రాహుల్ కుమార్ పాల్గొన్నారు.

### ఆసరా పెన్షన్ కార్డుల పంపిణీ



ఆసరా పెన్షన్ కార్డులు పంపిణీ చేస్తున్న రావులపాటి మోజెస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాం నగర్ కమాన్ బస్తీలో ఆదివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆసరా పెన్షన్ కార్డులను బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజెస్, మన్నె దామోదర్ రెడ్డిలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పేదలందరిని భాగస్వాములను చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కూరగాయల శ్రీను, ఎంబి జనార్ధన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం అభివృద్ధి కోసం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకొచ్చారని పేర్కొన్నారు. చిక్కడపల్లి గంగపుత్ర (బెస్త) సంఘ నూతన సంవత్సర కేలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గంగ పుత్రులకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారని అన్నారు. ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తూ మత్స్య సంపదను సృష్టిస్తుందన్నారు. సంఘం అధ్యక్షులు గుండు జగదీశ్ బాబు అధ్యక్షతన జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షుడు పాకరవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి నరాల వెంకటేష్, కోశాధికారి ముదారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## 'ప్రజల కోసం పనిచేసేది మావోయిస్టులే..'



విరసం సాహిత్యపాఠశాల కార్యక్రమంలో మాట్లాడుతున్న జి. కల్యాణ రావు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో ప్రజలకోసం నిజంగా పనిచేసేది మావోయిస్టేలేనని విప్లవకవి జి.కల్యాణ రావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విప్లవ రచయితల సంఘం (విరసం) 23వ సాహిత్య పాఠశాలల రెండో రోజు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళ్యాణరావు మాట్లాడుతూ... జూలై 2023 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం మిషన్ సమాధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ మిషన్ మావోయిస్టులను మాత్రమే కాకుండా దళితులు, ముస్లింలు, ఆదివాసీ ప్రజలను అణచివేయడానికేనని అన్నారు. 2024లో బీజేపీని ఓడించకపోతే పీడిత ప్రజల అస్తిత్వానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. విరసం ప్రతినిధులు రాంకీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్తలు సీమా ఆజాద్, బిట్టు, సారా బెనర్జి, దండపాని మహంతి పాల్గొన్నారు.

## అడహక్ కమిటీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న దుర్గాప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్ గౌడ్

అంబర్‌పేట: దేవస్థానం సేవా సమితి నూతన పాలకవర్గానికి తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని పలువురు కోరారు. ఆదివారం అంబర్‌పేట మహంకాళి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు స్థానిక పెద్దలతో పాటు గత పాలక వర్గం ఎన్నికల్లో పోటీచేసిన వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి గత ఏడాది నవంబర్‌తో ముగిసిందని తక్షణమే పాలకవర్గం సభ్యులు రాజీనామ చేసి ఎన్నికలు చేపట్టే వరకు అడహక్ కమిటీని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో దేవస్థాన సేవా సమితి మాజీ చైర్మన్ కె.దుర్గాప్రసాద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్ గౌడ్, నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## కనీస వేతనాలు చెల్లించి పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న వాచ్‌మెన్స్, స్వీపర్లు, అటెండర్లు తదితర కింది స్థాయి ఉద్యోగులకు కనీస వేతనాన్ని చెల్లించడంతోపాటు వారిని పర్మినెంట్‌చేయాలని ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ప్రభుత్వ కళాశాలల ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (బిఎల్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న సుమారు 1500 మంది క్రింది స్థాయి సిబ్బంది గత 30ఏళ్ళుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయకపోవడం బాధాకరం అన్నారు. యూనియన్ అధ్యక్షులు లక్ష్మినారాయణ, బీఎల్‌టీయూ అధ్యక్షులు దండి వెంకట్, ప్రధాన కార్యదర్శి సిద్దిరాములు, ప్రొఫెసర్ ననుమాస స్వామి, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం అభినందనీయం




వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

పద్మారావునగర్: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వైద్యపరంగా ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పలువురు వక్తలు కొనియాడారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్లో ఆదివారం ఫస్ట్ సోర్స్ కార్పొరేట్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేదల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, ఫస్ట్ సోర్స్ వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్ హెడ్ అభినవ్ ప్రసాద్, కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పవన్‌కుమార్ గౌడ్, ఎస్ఆర్‌డీ ప్రతినిధి శివరాణి, ఇందిరా భారతి, డాక్టర్ రాజేష్, అపర్ణ, ఉషాకర్ కీర్తి, అజయ్, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.

## 3 కేంద్రాలు.. 2100 మంది అభ్యర్థులు



ఉచిత శిక్షణ అర్హత పరీక్షకు పోటెత్తిన అభ్యర్థులు

రాంగోపాల్‌పేట్: పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గ్రీన్ ల్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, హాస్టల్ వసతి కోసం అర్హత పరీక్షను నిర్వహించారు. ఆదివారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఆవరణలో నిర్వహించిన పరీక్షలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు. ఎస్వీఐటీతో పాటు సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ, వరంగల్‌లోని లాల్‌బహదూర్ కళాశాలల్లో కూడా ఈ అర్హత పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు, డీసీపీ మధుకర్ స్వామి తెలిపారు. మొత్తం 3 కేంద్రాల్లో 2100 మంది పరీక్ష రాశారని ప్రతిభ కనబర్చిన 200ని ఎంపిక చేసి 6 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు.